ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి
జిల్లా వార్తలు

5★

శనివారం 4 జనవరి 2025

న్యూస్ బాక్స్

చైనా మాంజా అమ్మితే చర్యలు

కోల్‌సిటీ/మంథని జనవరి 3(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలో చైనా మాంజాను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ హెచ్చరించారు. చైనా మాంజా తెలంగాణలో నిషేధించబడిందని, ఎవరైనా పతంగులు విక్రయించే దుకణాదారులు చైనా మాంజా విక్రయిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. చైనా మాంజాతో పక్షులకు, మనుషులకు హాని కలుగుతుందని, పతంగులు ఎగురవేసే సమయంలో చైనా మాంజావల్ల గతంలో కొంతమంది ప్రాణాలు పోయాయని, మాంజా అమ్మినా, నిల్వ చేసినా, రవాణా చేసినా ఐదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించనున్నట్టు హెచ్చరించారు. దుకాణాల తనిఖీలను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

చెరువు శిఖం భూమిని పరిరక్షించాలి

పెద్దపల్లిటౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి) కాల్వశ్రీరాంపూర్ మండలం పందిల్లలో సర్వే నెంబర్ 185లో గల 43.03 ఎకరాల చెరువు శిఖం భూమి ఆక్రమణకు గురైందని గ్రామానికి చెందిన కౌంజు కుమారస్వామి తెలిపారు. భూఆక్రమణలపై విచారణ జరిపి ప్రభుత్వ భూమిని కాపాడాలని శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

నేత్ర, అవయవ దానంపై అవగాహన

ఓదెల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హరిపురంలో ఇటీవల కునారపు ఐలమ్మ మృతిచెందగా శుక్రవారం ఆమె ఇంటి వద్ద సదాశాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర, అవయ, శరీర దానాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. 35మంది నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. దాతలకు మాజీ జడ్పీటీసీ గంట రాములు డోనర్ కార్డులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సదాశాయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి లింగమూర్తి, మేర్గు బేష్మ చారి, క్యాతం మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

జూలపల్లి ఎస్సై బాధ్యతల స్వీకరణ

జూలపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జూలపల్లి ఎస్ఐగా సనత్‌కుమార్ శుక్రవారం బాధ్యతలను చేపట్టారు. మంచిర్యాల్‌లో పనిచేసిన ఆయన సాధారణ బదిలీలో భాగంగా ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. జూలపల్లిలో పనిచేసిన ఎస్ఐ శ్రీధర్ ఇటీవల బదిలీఅయ్యారు. ఎస్ఐ సనత్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో ప్రజల శాంతిభద్రతలను కాపాడడంలో అందరి సహకారంతో కృషిచేయనున్నట్లు పేర్కొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో నిరసన

కోల్‌సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల క్రితం భూగర్భ డ్రైనేజీ కోసం రోడ్లు తవ్వి ఇప్పటివరకు రోడ్లు వేయడం లేదంటూ శుక్రవారం రామగుండం కార్పొరేషన్ 26వ డివిజన్ మార్కండేయకాలనీ సిద్ధి వినాయక నగర్‌లో సీపీఐ నగర కార్యదర్శి కనకరాజు ఆధ్వర్యంలో కాలనీవాసులు నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ నాయకులు ఓదమ్మ, రేణుక, నర్మద, కాలనీవాసులు కిశోర్, రమేష్, కమలాకర్, శ్రీధర్, రాధా, మల్లయ్య, పోషం ఉన్నారు.

రెండేళ్లుగా విడుదల కాని ఫీజు రీయింబర్స్‌మెంట్

- ఏడాదికాలంగా బీసీ విద్యార్థులకు అందని స్కాలర్‌షిప్
- జిల్లా వ్యాప్తంగా పెండింగులో రూ.15.75 కోట్లు
- ఇబ్బందులు పడుతున్న బీసీ విద్యార్థులు



చదువులు సాగేదెలా?

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న బీసీ, ఈబీసీ విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ డబ్బులను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు, కళాశాలల యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా రెండేళ్లకు సంబంధించి 15 కోట్ల 75 లక్షల 82 వేల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థుల స్కాలర్ షిప్ డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయి. కావాల్సిన బడ్జెట్ కోసం జిల్లా వెనుకబడిన తరగతుల శాఖాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినప్పటికీ, ట్రెజరీల్లో బిల్లులు పాస్ కావడం లేదు. దీంతో కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించక పోవడంతో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని మెలిక పెడుతున్నారు. అలాగే విద్యార్థులకు నెలనెలా చెల్లించే స్కాలర్‌షిప్ సొమ్మును కూడా పూర్తి స్థాయిలో విడుదల చేయ లేదు. జిల్లాలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు, ఇంజినీ రింగ్, బీఈడీ, డీఈడీ, నర్సింగ్, బీఫార్మసీ, ఎం ఫార్మసీ, తదితర కోర్సులకు సంబంధించిన కళాశాలలు ఉన్నాయి. అలాగే ప్రభుత్వ డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు సైతం ఉన్నాయి. ప్రైవేట్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు నిర్ణేశించిన మేరకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తుంది. ప్రభు త్వం ఇచ్చే ఫీజు కంటే ఎక్కువ ఉన్న మొత్తాన్ని విద్యార్థులు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే మెస్ చార్జీల కింద కోర్సులను బట్టి స్కాలర్‌షిప్

విద్యార్థులకు రావాల్సిన బకాయిలు

	స్కాలర్‌షిప్	ఫీజు రీయంబర్స్‌మెంట్
2021-22	16,21,000	-------
2022-23	7,42,000	7,59,63,000
2023-24	2,53,22,000	5,39,34,000

ఇస్తారు. ఈ సొమ్మును నెలనెలా గాకుండా ఒకేసారి విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు కేవలం స్కాలర్‌షిప్ డబ్బులను మాత్రమే వారి ఖాతాల్లో జమ చేస్తారు. 2021-22 విద్యా సంవత్సరానికి సంబంధించి బీసీ విద్యార్థులకు 16లక్షల 21 వేల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నాయి. 2022-23 సంవత్సరానికి బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ 7 లక్షల 42 వేల రూపాయలు రావాల్సి ఉండగా, ఫీజు రీయింబర్స్‌మెంట్ 7 కోట్ల 59 లక్షల 63 వేల రూపాయలు విడుదల కావాల్సి ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి 2 కోట్ల 53 లక్షల 22 వేల రూపాయల స్కాలర్‌షిప్ డబ్బులు ఇప్పటి వరకు కూడా విద్యార్థుల ఖాతాల్లో జమ కాలేదు. బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ 5 కోట్ల 39 లక్షల 34 వేల రూపాయలు విడుదల కావాల్సి ఉన్నాయి.

● కోర్సులు పూర్తిచేసిన విద్యార్థుల నుంచి వసూలు..

జిల్లాలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై 5, 6 వేల మంది విద్యార్థులు ఆధారపడి ఉన్నత చదువులు చదువుతున్నారు. రెండేళ్ల నుంచి ప్రభుత్వం

మిగతా 8వ పేజీలో...

విద్యార్థుల అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి : కలెక్టర్



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషిచేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ కోయ శ్రీహర్ష కార్యక్రమాన్ని సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ సావిత్రీబాయి జయంతిని మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మండలం నుంచి ఒక మహిళా ఉపాధ్యాయురాలిని ఎంపికచేసి సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. బాలికల విద్య కోసం సావిత్రీబాయి పూలే కృషి చేశారని, దేశంలో మొట్టమొదటిసారిగా మహిళల విద్యకోసం ప్రత్యేకంగా పాఠశాలలు ప్రారంభించారన్నారు. సావిత్రీబాయి పూలే స్ఫూర్తితో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులను కలెక్టర్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాధవి, జిల్లా సమగ్రశిక్ష సమన్వయకర్త పీఎం షేక్, అధికారులు పాల్గొన్నారు.

గేటు పడితే.. గంట ఆగాల్సిందే..

- నత్తనడకన కూనారం రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు



కూనారం రైల్వే క్రాసింగ్ వద్ద వాహనాల రద్దీ

7

ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక కార్యాచరణ

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్, డీఈవో తదితరులు

8

నేడు సుల్తానాబాద్‌లో ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు

- ఉదయం 9 గంటలకు ప్రారంభం
- విజేతలకు నగదు, కన్సోలేషన్ బహుమతులు



ముగుల పోటీలకు ముస్తాబైన అల్ఫోర్స్ హైస్కూల్ ఆవరణ

పెద్దపల్లి కల్చరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సుల్తానాబాద్‌లో పూసాల రోడ్‌లోగల అల్ఫోర్స్ హైస్కూల్ ఆవరణలో ఈనెల 4న ఉదయం 9 గంటల నుంచి 11గంటల వరకు నిర్వహించనున్న ముత్యాల ముగ్గుల పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సనాతనంగా వస్తున్న సంస్కృతి సంప్రదాయాలను కాపాడేందుకు, మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రతి ఏటా ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది కూడా ముగ్గుల పోటీలకు ఏర్పాట్లు చేశారు. 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్ వేర్).. స్థానిక పార్టనర్ అల్ఫోర్స్ హైస్కూల్ సుల్తానాబాద్, అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి నరేందర్‌రెడ్డి సహకారంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి కింద 6 వేలు, రెండో బహుమతి కింద 4 వేలు, మూడో బహుమతి కింద 3వేల రూపాయల నగదు, 20 మంది మహిళలకు కన్సోలేషన్ బహుమతులు అందజేయనున్నారు. పోటీల్లో పాల్గొనే మహిళలు ఉదయం 8:30గంటల వరకు వేదిక వద్దకు వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలని, చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలని, ఎన్ని వరుసలో చెప్పగలిగి ఉండాలని, ఆ ముగ్గులో సంక్రాంతి నేపథ్యం గానీ, ఇతర సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే అంశాలు గానీ, సామాజిక అంశాలపై గానీ ముగ్గులు వేయవచ్చని పేర్కొన్నారు. ఎవరి రంగులు వారే తెచ్చుకోవాలని, ముగ్గు ఒకరు మాత్రమే వేయాలని, రంగులు అందించేందుకు ఒకరు సహాయకులుగా ఉండవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు. పోటీల్లో జిల్లాకు చెందిన మహిళలు, యువతులు, విద్యార్థినులు పాల్గొనవచ్చని తెలిపారు. ఈ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి. నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ అంతటి అన్నయ్యగౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, వైస్‌చైర్ పర్సన్ బిరుదు సమత, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ హాజరుకానున్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

పెద్దపల్లి రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. పెద్దపల్లి మండలం కాపులపల్లి నుంచి గోపయ్యపల్లి వరకు రూ.కోటితో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ గ్రామాలను అనుసంధానం చేస్తూ రోడ్లు విస్తరణ చేస్తున్నామన్నారు. అంతర్గత రహదారులను అభివృద్ధిచేసి ప్రజా రవాణా మరింత మెరుగుపరుస్తున్నామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వానాకాలంలో సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అదనంగా చెల్లించామని తెలిపారు. ఎన్నికల ముందుఇచ్చిన ప్రతీ హామీని దశలవారీగా అమలు చేస్తున్నామని గుర్తుచేశారు. రానున్న సంక్రాంతికి రైతులకు ఏడాదికి ఎకరాకు రూ.15వేలు రైతు భరోసా చెల్లిస్తామన్నారు. పీఆర్ ఈఈ గిరీష్‌బాబు, డీఈఈ శంకరయ్య, మార్కెట్ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, వైస్‌చైర్మన్ మల్లారెడ్డి, డైరెక్టర్లు, విండో చైర్మన్లు చింతపండు సంపత్, మాదిరెడ్డి నర్సింహ రెడ్డి, నాయకులు ఎడెల్లి శంకర్, నూగిల్ల మల్లయ్య, గోపు శ్రీనివాస్, మందల సత్యనారాయణ రెడ్డి, కళబోయిన మహేందర్, యాంజాని మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

● సుల్తానాబాద్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణరావుపల్లిలో కోటి రూపాయలతో నిర్మించనున్న రోడ్డు పనుల శిలాఫలకాన్ని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, బండారి రమేష్, దామోదర్‌రావు, వెంకన్న, జానీ, చిలుక సతీష్, తిరుమల్‌రావు, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు అంజన్న ఈవో బదిలీ

● వేములవాడ ఈవో వినోద్‌కు అదనపు బాధ్యతలు



రామకృష్ణరావును సత్కరిస్తున్న దేవస్థానం సిబ్బంది

మల్యాల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం ఈవో ఎం.రామ కృష్ణరావు బదిలీ అయ్యారు. సికింద్రాబాద్ లోని గణేశ్ టెంపుల్ ఈవోగా బదిలీ చేస్తూ దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ కె.జ్యోతి ఉత్తర్వులు జారీ చేశారు. దేవాదాయశాఖలో ఆర్‌జేసీగా కూడా అదనపు బాధ్యతలు చూస్తున్న రామకృష్ణారావుకు ఇటీవల దేవాదాయశాఖ తరుపున ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరు అవడం, కొండగట్టు దూరం కావడంతో బదిలీ చేసినట్లు తెలుస్తోంది. రామకృష్ణారావు కొండగట్టులో ఈవోగా ఆగస్టు 1న బాధ్యతలు చేపట్టి కేవలం అయిదు నెలలు మాత్రమే విధులు నిర్వహించారు. ఈ కాలంలో దేవస్థానం పరిధిలో అభివృద్ధి, పాలనలో, సిబ్బంది విధుల నిర్వహణలో పారదర్శకతకు కృషి చేశారు. రామకృష్ణారావు స్థానంలో కొండగట్టుకు వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఈవో కె.వినోద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

● బదిలీ అయిన ఈవో రామకృష్ణారావు శుక్రవారం దేవస్థానం అధికారులు, సిబ్బంది, అర్చకులు సత్కరించారు. అంజన్న సన్నిధిలో పూజలు నిర్వహించిన అనంతరం సత్కరించారు. ఆయన అం దించిన సేవలను కొనియాడుతూ అభినందించారు. ఈ కార్యక్రమంలో మేజర్ టెంపుల్స్ జేఏసీ నాయకుడు ఉపాధ్యాయుల చంద్రశేఖర్, పర్యవేక్షకులు హరిహరనాథ్, అశోక్, రాములు ప్రధానర్చ కులు రామకృష్ణారావు, అర్చకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



భవనం పక్కనున్న బాత్‌రూం గోడను కూల్చుతున్న రెవెన్యూ, గ్రామ పంచాయతీ సిబ్బంది

కరీంనగర్ రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలో సర్వే నంబర్ 765లోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ కట్టడానిన రెవెన్యూ, గ్రామ పంచాయతీ సిబ్బంది శుక్రవారం తొలగించారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ఆర్డీవో మహేశ్వర్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఇందులో బాగంగా 628 సర్వే నంబర్‌లో హద్దులను ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కాగా 765 సర్వే నంబర్‌లో స్థానికుల ఫిర్యాదు మేరకు సర్వేయర్ సంతోష్, ఆర్‌ఐ వాస్తవిక్, పంచాయతీ కార్యదర్శి హిదైతుల్లా మోఖాపై వెళ్లి పరిశీలించారు. ప్రభుత్వ స్థలంలో నిర్మించిన బాత్రూం గోడను కూల్చివేశారు. సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేసి ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్ పట్టివేత

● రెండు మొరం ట్రాక్టర్లు, జేసీబీ సీజ్

మెట్‌పల్లిటౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న ఒక ఇసుక టిప్పర్‌ను, రెండు మొరం ట్రాక్టర్లను పట్టుకున్నట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద రాత్రి సమయంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను, మొరం తరలిస్తున్న ట్రాక్టర్‌లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌లకు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మెట్‌పల్లి మం డలం ఆత్మనగర్ వాగులో నుంచి అక్రమంగా ఇసుకను తరలించడానికి వినియోగిస్తున్న జేసీ బీని పట్టుకున్నట్లు తెలిపారు. యజమానిపై ఎస్‌ఐ కిరణ్ కుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చీకటి జీవితాల్లో వెలుగుబాట



రేకుర్తిలోని అంధుల పాఠశాల

కంప్యూటర్ నేర్చుకుంటున్న అంధ విద్యార్థులు

● కరీంనగర్‌లో 82 మందితో అంధుల పాఠశాల

● విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా ప్రత్యేక బోధన

● నేడు బ్రెయిలీ లిపి సృష్టికర్త లూయిస్ జయంతి

భగత్‌నగర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): చూపులేనిదే ప్రపంచం చీకటిమయం... అంధుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఫ్రాన్స్‌కు చెందిన లూయిస్ బ్రెయిలీ ఎంతో కృషి చేశారు. ఆయన రూపొందించిన లిపి ద్వారా అంధులు నేడు ప్రపంచాన్ని వీక్షించగలుగుతున్నారు. ఆ బాటలోనే కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన అంధుల పాఠశాల వారు జీవితంలో ఎదిగేలా తోడ్పాటును అందిస్తోంది. బ్రెయిలీ లిపి సృష్టకర్త లూయిస్‌బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

లూయిస్ బ్రెయిలీ అంధుల కోసం జీవితాన్ని అర్పించిన మహానుభావుడు. అంధుల సేవలకు ప్రతీక, అంధులు చదువుకునేందుకు వీలుగా బ్రెయిలీ లిపిని అవిష్కరించి విప్లవాత్మకమార్పులకు బ్రెయిలీ స్వీకారం చుట్టారు. 1809 జనవరి 4వ తేదీన ఫ్రాన్స్‌లోని కూప్రే గ్రామంలో సామాన్య కుటుంబంలో జన్మించిన లూయిస్ మూడు సంత్సరాల వయస్సులో ప్రమాదంలో కంటిచూపును కోల్పోయారు. రాయల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్‌బ్లైండ్‌యూత్‌లో చేరి విద్యాభ్యాసం కొనసాగించి అంధులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బ్రెయిలీ లిపిని 1824 సంవత్సరంలో అవిష్కరించారు. ప్రత్యేకమైన అక్షరమాలతో అక్షరాలు, అంకెలు, ఇతర చిహ్నాలు అందించి అంధులకు తాము చదువగలం, రాయగలం అనే స్వేచ్ఛను ప్రసాదించారు. బ్రెయిలీ లిపి ద్వారా సంగీత నోటేషన్లు, గణిత సూచనలు, శాస్త్రీయ సమాచారాన్ని అంధులు నేర్చుకుంటున్నారు. విద్యావ్యవస్థలో బ్రెయిలీలిపి వారి ఆలోచనలను వ్యక్తపరచడానికి దోహదం చేసింది.

● కరీంనగర్‌లో అంధుల పాఠశాల

కరీంనగర్ జిల్లా కేంద్రంలో 1981లోనే అంధుల పాఠశాలను నెలకొల్పి ఈ ప్రాంత అంధ విద్యార్థులకు విద్యాభ్యాసం చేయిస్తున్నారు. 1996 సంవత్స రంలో పూర్తి స్థాయిలో ప్రత్యేకమైన రెసిడెన్షియల్ పాఠశాలగా మార్చుచెంది. ఆ తర్వాత రేకుర్తిలో 2013 సంవత్సరంలో సొంత భవనాన్ని సమకూర్చి అంధ విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారు. ఈ పాఠశాలలో 82 మంది విద్యార్థులకు 1వ తరగతి నుండి 10వతరగతి వరకు విద్యాభ్యాసం చేస్తన్నారు. వీరి చదువుకు ఆటంకం రాకుండా ప్రభుత్వం అన్ని వసతులు కల్పించింది.

విద్యార్థులే ప్రపంచం



కరీంనగర్ అంధుల పాఠ శాలలో 82మంది విద్యార్థు లకు 32మంది బాలికలు, 50మంది బాలురు విద్యా భ్యాసం చేస్తున్నారు. విద్యా ర్థులే ప్రపంచంగా వారికి ఏలోటు రాకుండా మాములుగానే విద్యా బోధన చేస్తున్నాం. విద్యార్థులు చురుకుగా ఉంటూ అన్ని విషయాలపై ఆసక్తి చూపిస్తుంటారు. సాధారణ విద్యార్థుల మాదిరిగానే విద్యను కొనసాగిస్తున్నారు.

- బాస నర్మద, పాఠశాల ప్రిన్సిపాల్

● ఉన్నత చదువే లక్ష్యం



ఉన్నత చదువే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ఉపాధ్యాయులు బోధించిన అంశాలపై పట్టు సాధించి ముందుకు వెళ్తున్నాం. సంగీతం పై పట్టు సాధించడంతో పాటు, కంప్యూటర్ విషయ పరి జ్ఞానాన్ని సొంతం చేసుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించడమే లక్ష్యంగా చదువుకుంటున్నాం.

- కళ్యాణం తిరుమల, 8వ తరగతి

అంధులకు ప్రపంచాన్ని చూపిన మహాత్ముడు



బ్రెయిలీ లిపి చదువుతున్న అంధుడు

జగిత్యాల అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చూపు లేక ప్రపంచాన్ని చూడలేని అంధులకు ఆరు చుక్కల భాషలో ప్రపంచాన్ని చూపిన మహాత్ముడు లూయిస్ బ్రెయిలీ. నేడు అనేక మంది అంధులు ఉద్యోగాలు చేస్తూ తమ విధులు సక్రమంగా నిర్వహిస్తున్నారంటే దానికి బ్రెయిలీ రూపొందించిన లిపి కారణం

దారి చూపిన మహానుభావుడు



లూయిస్ బ్రెయిలీ తయారు చేసిన బ్రెయిలీ లిపి నేడు నాతో పాటు అనేక మంది అంధులకు దారి చూపింది. కంటి చూపు లేకపోయినా చదువుకుని ఈరోజు ఉద్యోగం చేస్తూ విధులు సక్రమంగా నిర్వహిస్తున్నామంటే దానికి ఆ మహానుభావుడే కారణం. రెండు శతాబ్దాలు దాటినప్పటికీ ఆయన ఇచ్చిన ఈ ఆధారంతో ప్రపంచంలోనే అనేకమంది అంధువులు చదువుకోవడంతో పాటు ఉన్నత స్థాయి ఉద్యోగాలు కూడా చేస్తున్నారు.

- గందారపు రాజు, జూనియర్ అసిస్టెంట్, కమర్షియల్ ట్యాక్స్ ఆఫీస్

ఆయనను స్మరించుకోవడం అదృష్టంగా భావిస్తున్నా



అంధకారంతో సాగుతున్న బతుకులకు దారి చూపిన మహానుభావుడు లూయిస్‌బ్రెయిలీ. ఆ యన జన్మదినం సందర్భంగా ఆయనను స్మరిం చుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను. ప్రపం చంలోనే కోట్లాది మంది అంధులకు నాడు దారి చూపి ఈరోజు ఉన్నత స్థాయిలో ఉండటానికి కారణమైన లూయిస్ బ్రెయిలీని మరిచి పోము.

- బాల శంకర్, జూనియర్ అసిస్టెంట్, ఇరిగేషన్

అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

● మెట్‌పల్లి అటవీ రేంజర్ అధికారి షౌకత్‌అలీ

మెట్‌పల్లిరూరల్, జనవరి, 3(ఆంధ్రజ్యోతి) : అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి అటవీ రేంజర్ అధికారి షౌకత్‌అలీ హెచ్చరించారు. మండలంలోని రంగారావుపేట బీట్ కంపార్ట్‌మెంట్ పరిధిలో ఉన్న పాటిమీదితండా గ్రామ శివారులో అటవీ భూమిని చదును చేస్తూ కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేసినట్లు వచ్చిన సమాచారంతో ట్రాన్స్‌కో మెట్‌పల్లి ఏడీఈ మనోహర్‌తో కలిసి సందర్శించారు. అటవీ భూమిలో ఏర్పాటు చేసిన కరెంట్ స్తంభాలు, విద్యుత్ తీగలను తొలగించారు. అటవీ భూమిలో కరెంట్ స్తంభాలు ఏర్పాటు వారిని విచారించారు. అనంతరం ఆత్మకూర్ గ్రామంలో చుట్టుఉన్న గ్రామస్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఆత్మకూర్, రంగరావుపేట, పాటిమీదతండా గ్రామాల్లో సుమారు వందల ఎకరాల అటవీ భూమిని చదును చేసి ఆక్రమిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అటవీ ప్రాంతాన్ని కబ్జా చేసి వ్యవసాయ భూములుగా మార్చడంతో అడవీ జంతువులు, చిరుతపులి సంచరిస్తుందని, అటవీ భూములు, చెట్లను కాపాడేందుకు గ్రామాల మధ్య సరిహద్దులను ఏర్పాటు చేయాలని ప్రజలు అధికారులను కోరారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ అటవీ ప్రాంతంలోకి చొరబడి అక్రమంగా భూముల కబ్జాలకు పాల్పడేందుకు యత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తిరిగి వాటిని స్వాధీనం చేసుకునేందుకు దృష్టి సారిస్తామన్నారు. అటవీ భూమి సర్వే చేసేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు కిరణ్‌కుమార్, అనిల్, రాజు, అటవీ సెక్షన్ అధికారులు చైతన్యశ్రీ, అరుణ్‌కుమార్, బీట్ అధికారులు సత్తార్, శివరాజ్, అధికారులు, సిబ్బంది, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



పాటిమీదితండాలో కబ్జాకు గురైన అటవీభూమిని పరిశీలిస్తున్న అధికారులు

ఆసుపత్రిలో యువకుడి మృతి

● బంధువుల ఆందోళన



శ్రావణ్(ఫైల్)

పెద్దపల్లిటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శుక్రవారం యువకుడి మృతిపై బంధువులు ఆందోళనకు దిగారు. కమాన్‌పూర్ మండలం పేరపల్లికి చెందిన అమృత, శ్రీనివాస్ దంపతుల కుమారుడు ఆకుల శ్రావణ్ (26) గురువారం జ్వరంతో బాధపడుతూ సదరు ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చాడు. డాక్టర్ పరీక్షలు చేసి ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉన్నాయంటూ జాయిన్ చేసుకున్నాడు. అర్ధరాత్రి దాటిన తరువాత శ్రావణ్ మృతి చెందాడు. డాక్టర్ నిర్లక్ష్యం వల్లే చనిపోయాడని, హెవీడోస్ ఇచ్చాడని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. కుటుంబ సభ్యులతో డాక్టర్ చర్చలు జరపడంతో ఆందోళన విరమించి అంబులెన్స్‌లో మృతదేహాన్ని పేరపల్లికి తరలించారు. మృతుడికి ఇంకా పెళ్లి కాలేదు. ఈ ఘటనపై పోలీసులకు ఏలాంటి ఫిర్యాదు అందలేదు.

ప్రమాదవశాత్తు నేతకార్మికుడి మృతి

సిరిసిల్ల క్రైం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని పద్మనగర్‌లో కళ్యాడపు సుభాష్(63) అనే నేత కార్మికుడు ప్రమాదవశాత్తు శుక్రవారం తెల్లవారుజామున మురికికాలువలో పడి మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం... బెల్లంపల్లిలోని రడగపాల బస్తీకి చెందిన సుభాష్ కొంతకాలం క్రితం సిరిసిల్లకు వలసవచ్చి పవర్‌లూం కార్మికుడిగా పనిచేస్తు జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుమారులందరూ హైదరాబాద్‌లో ఉండగా భార్య బెల్లంపల్లిలో ఉంటోంది. సుభాష్ ఒక్కడే సిరిసిల్లకు వచ్చి పవర్‌లూం కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు మురికికాలువలో పడి మృతిచెందాడు. శుక్రవారం ఉదయం మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సుభాష్ కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

ఎన్టీపీసీ సోలార్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం

జ్యోతినగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ రహదారి పక్కన ఉన్న ఎన్టీపీసీకి చెందిన పది మోగా వాట్ల సోలార్ ప్లాంట్‌లో శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగింది. ప్లాంటులోని ఇన్వర్టర్ గదిలో బ్యాటరీ పేలడంతో మంటలు లేచాయి. వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. సీఐఎస్ఎఫ్‌కు చెందిన అగ్నిమాపక విభాగం సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. అగ్ని ప్రమాదం వల్ల సోలార్ ప్లాంట్‌లో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు.. కేసు నమోదు

సిరిసిల్ల క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వాట్సప్ గ్రూపుల్లో ఒక వర్గానికి చెందిన వారిని కించపరిచి ప్రజల మధ్య రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టిన సిరిసిల్ల పట్టణ బీజేపీ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్‌పై శుక్రవారం కేసు నమోదుచేశామని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పనులు మాను కోవాలని గ్రూపులలో అనవసర మెస్సేజ్‌లను పోస్ట్ చేయరాదని పేర్కొన్నారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టినా, ఎవరో పెట్టిన పోస్టులను ఫార్వర్డ్ చేసినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భూ కబ్జా కేసులో నిందితుడి కస్టడీ

కరీంనగర్ క్రైమ్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తప్పుడు పత్రాలు సృష్టించి రేకుర్తిలోని సర్వే నంబర్ 74లో ఎకరం భూమి ఆక్రమించిన భూ ఆక్రమణదారు అబ్దుల్ అజీజ్‌ను కొత్తపల్లి పోలీసులు శుక్రవారం కస్టడీకి తీసుకున్నారు. నకిలీ ధ్రువపత్రాలు సృష్టించడమే కాక, బాధితుడి భూమి ఆక్రమణకు పాల్పడ్డ అబ్దుల్ అజీజ్‌ను గత నెల 26వ తేదీన అరెస్టు చేసి రిమాండుకు తరలించిన విషయం విదితమే. ఈ కేసుకు సంబంధించిన మరింత సమాచారం సేకరించేందుకు విచారణ కోసం కోర్టు ద్వారా 24గంటల పోలీసు కస్టడీకి తీసుకున్నామని కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి తెలిపారు. కస్టడీలోకి తీసుకున్న అబ్దుల్ అజీజ్ నుంచి మరింత విలువైన సమాచారం సేకరించేందుకు అతని ఇంటిలో సోదాలు నిర్వహించిన కొత్తపల్లి పోలీసులు పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

కరీంనగర్ రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గురుకులాల్లో ఐదోతరగతి ప్రవేశపరీక్షల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాలతి శుక్రవారం ఒక ప్రటనలో తెలిపారు. ప్రస్తుతం నాలుగోతరగతి చదువుచున్న విద్యార్థిని, విద్యార్థులు దరఖాస్తు చేసుకో వాలన్నారు. ఇందుకోసం కులం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బర్త్‌సర్టిఫికేట్, ఫొటోలు, సంతకం, ఆధార్ కార్డు, నాలుగోతరగతి బోనఫైడ్ సర్టిఫికెట్‌తో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఫిబ్రవరి1వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం ఉందని, టీజీసీఈటీ. సీజీజీ.జీవోవీ.ఇన్‌లో అనే వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెల్గటూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్తంభంపల్లి గ్రామానికి చెందిన బాలాస్తి గంగాధర్ (43)అనే వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గంగాధర్ కొన్ని రోజులుగా దృష్టి లోపంతో బాధపడుతున్నాడు. తన సొంత పనులు కూడా చేసుకోలేక ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో మనో వేదనకు గురైన గంగాధర్ జీవితంపై విరక్తి చెంది ఈ నెల 1న పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబీకులు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. గంగాధర్ తండ్రి భీమయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

నగరంలో కోతుల బెడద



● విద్యార్థులపైకి వచ్చిన వానరాల గుంపు

● భయంతో భవనం పైనుంచి దూకిన దన్గర్‌వాడి విద్యార్థి, తీవ్రగాయాలు

● కోతుల బెడదను నియంత్రించేందుకు చర్యలు-కమిషనర్

కరీంనగర్ క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో కొతుల బెడద రోజురోజుకు తీవ్రమవుతున్నది. కోతులు గుంపులుగుంపులుగా ఇళ్లలోకి, పాఠశాలలు, దుకాణాల్లోకి చొరబడుతున్నాయి. కరీంనగర్ జ్యోతినగర్‌లోని ప్రభుత్వ దన్గర్‌వాడి హైస్కూల్‌లో గురువారం మధ్యాహ్నం కోతుల గుంపు విద్యార్థులపైకి రావటంతో ఒక్కసారిగా చెల్లాచెదురుగా పరిగెత్తారు. ఈ సందర్భంలో ఎనిమిదోతరగతి విద్యార్థి(14) భయంతో పాఠశాల భవనం మొదటి అంతస్థు నుంచి కిందకు దూకగా అతని రెండు కాళ్లు విరిగిపోవటమే కాకుండా నడుం భాగంలో తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తీవ్రంగా గాయపడిన విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తున్నారు. దన్గర్‌వాడి ప్రభుత్వ హైస్కూల్‌లో చాలాకాలంగా కోతుల బెడద తోపాటు కుక్కల బెడద కూడా ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రమోద తెలిపారు. కోతుల గుంపు దాడితో విద్యార్థికి తీవ్రగాయాలైన సంఘటనపై జిల్లా విద్యాశాఖ అధికారికి రాతపూర్వ కంగా సమాచారం అందిచామని ఆమె తెలిపారు.



ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న విద్యార్థి

కోతుల తరలింపునకు ఖరారుకాని టెండర్...

గతంలో కోతుల బెడదపై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదుచేస్తే కొద్దిరోజులు కోతులను పట్టుకుని దూరప్రాంతానికి, అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లి వదిలిపెట్టారు. నగరంలోని కోతుల బెడదను నియంత్రించేందుకు మున్సిపల్ కార్పొరేషన్ కోతులను పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టేందుకు ఆరు నెలల కిందట టెండర్లు పిలిచి నేటికీ ఖరారు చేయలేదని కార్పొరేటర్ పెద్దపల్లి జితేందర్ వాపోయాడు. తాను కూడా పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదన్నాడు. రోజురోజుకు కోతుల బెడద తీవ్రమవుతుందని డివిజన్ ప్రజలు తన దృష్టికి తీసుకువస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుని వెంటనే టెండర్‌ను ఖరారు చేసి కోతుల తరలింపు చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ జితేందర్ డిమాండ్ చేస్తున్నారు.

పాఠశాలలకు కొండముచ్చుల పంపిణీ

కరీంనగర్‌లోని దన్గర్‌వాడి ప్రభుత్వ స్కూల్‌లో కోతుల గుంపు భయంతో భవనంపై నుంచి దూకిన విద్యార్థికి తీవ్రగాయాలైన ఘటనపై మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. నగరంలోని ప్రతీపాఠశాలలో కోతుల బెడదను నియంత్రించేందుకు కొండముచ్చులను పంపిణీ చేస్తామని ప్రకటించారు. కోతుల బెడద తీవ్రంగా ఉన్న కాలనీలు, డివిజన్లలో కోతులను పట్టుకుని అడవిలో వదిలిపెడుతూ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కోతులను పట్టుకునేందుకు టెండర్లు పిలిచేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. కోతులకు తినుబండారాలు, ఇతర ఆహారం అలవాటు చేయవద్దని మున్సిపల్ కమిషనర్ సూచించారు.

- మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

ఎస్‌యూ డిగ్రీ పరీక్షల్లో పదిమంది విద్యార్థులు డీబార్

గణేశ్‌నగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడ్డ పదిమంది విద్యార్థులను శుక్రవారం డీబార్ చేసినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌లోని అపూర్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, శివాని డిగ్రీ కళాశాలలో ఇద్దరు, శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో ఒకరు, పెద్దపల్లిలోని డిగ్రీ కళాశాలలో ఒకరు, ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో ఒకరు, కరీంనగర్‌లోని కిమ్స్ డిగ్రీ కళాశాలలో ముగ్గురు విద్యార్థులు డీబార్ అయినట్లు తెలిపారు.

నేషనల్ హైవే పనులను అడ్డుకున్న రైతులు

ముత్తారం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ హైవే పనులను శుక్రవారం రైతులు అడ్డుకున్నారు. సంబంధిత గుత్తేదారులు ఇష్టారీతిలో చేస్తున్నారని, గతంలో ఇచ్చిన మ్యాపు ఒకచోట ఉండగా.. పనులు మరొకచోట చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలోని పోతారం, మైదంబండ గ్రామాల్లో పనులను శుక్రవారం రైతులు అడ్డుకోగా తహసీల్దార్ సుమన్, ఎస్సై నరేష్‌లు వచ్చి రైతులతో మాట్లాడారు. సర్వేయర్‌ను పిలిపించి మ్యాపులో ఉన్నచోట పోలీసుల ఆధ్వర్యంలో ట్రెంచ్ చేయించారు. భవానీప్రసాద్, రాజబాబు, శ్రీధర్ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

బీసీలపై గతంలో లేని ప్రేమ ఇప్పుడు ఎందుకు?

- మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు


మాట్లాడుతున్న గోనె ప్రకాశ్‌రావు

సుభాష్‌నగర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవితకు బీసీలపై గతంలో ఎన్నడూ లేని ప్రేమ ఇప్పుడు ఎందుకు పుట్టుకు వచ్చిందని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు ప్రశ్నించారు. శుక్రవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎంతమంది బీసీలకు ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. ఎంత బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కేబినెట్‌లో స్థానం కల్పించారని ప్రశ్నించారు. మొదటి సారి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినపుడు కేబినెట్‌లో అసలు మహిళలే లేరని అన్నారు. బీసీలపై కవిత మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. అలాంటి వారు సావిత్రిబాయి పూలే జయంతి రోజు ధర్నా చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. జైలుకు వెళ్లిన వారంతా ముఖ్యమంత్రులు అవుతారన్న ఆశతో కవిత కూడా తన ప్రయత్నాలు మొదలుపెట్టిందన్నారు. అయితే తన అన్ననే తనకు పోటీగా వస్తున్నాడనే సమాచారం తనకు ఉందన్నారు. అసెంబ్లీలో బీసీ ఎమ్మెల్యేలు, శాసన మండలిలో బీసీ ఎమ్మెల్సీలు బీసీ అంశంపై ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్‌కు అప్పులు వారసత్వంగా ఇచ్చిన బీఆర్ఎస్ నేతలు కొద్ది రోజులు పనిచేసే సమయాన్ని ప్రభుత్వానికి ఇవ్వాలన్నారు. మెట్రో సేవలను షామీర్‌పేట వరకు పొడగించడం అభినందనీయమని అన్నారు. మంచిర్యాల నుంచి బసంత్‌నగర్‌కు నేరుగా రోడ్డు నిర్మాణం చేయడం వల్ల కరీంనగర్‌కు రావడానికి రాను పోను 36 కిలోమీటర్ల దూరం తగ్గుతుందన్నారు.

ఖని కూరగాయల మార్కెట్‌లో రైతుల ఆందోళన

- హమాలీలు కూరగాయలను దొంగిలిస్తున్నారని ఆరోపణ


నిరసన తెలియజేస్తున్న రైతులు, వ్యాపారులు

కళ్యాణ్‌నగర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌కు తీసుకువచ్చిన కూరగాయలను హమాలీలు బస్తాల నుంచి దించేటప్పుడు దొంగిలిస్తున్నారంటూ శుక్రవారం గోదావరిఖని రైతులు బైఠాయించారు. మార్కెట్‌కు తాము తీసుకువచ్చిన బస్తాల నుంచి కూరగాయలు దొంగిలించి హమాలీ కార్యాలయంలో పెట్టుకుంటున్నారని రైతులు ఆరోపించారు. హమాలీలు దాచి పెట్టిన కూరగాయాలను తీసుకువచ్చి రోడ్డుపై పారబోశారు. ఆందోళనలో మార్కెట్ కమిటీ అధ్యక్షుడు మల్లేష్, రైతులు, ఆసాములు, హోల్‌సేల్ వ్యాపారులు సదా నందం, రవీందర్, లక్ష్మయ్య, సంపత్, అనీల్, సునీల్, శ్రీను పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పార్వతిపరమేశ్వరులను దర్శించుకొని తరించారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.


కూనారం రైల్వే గేటు వద్ద నిలిచిన వాహనాలు

గేటు పడితే.. గంట ఆగాల్సిందే..

- నత్తనడకన కూనారం రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

పెద్దపల్లిటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి పట్టణంలోని కూనారం క్రాస్ రోడ్డులోగల రైల్వే క్రాసింగ్ వద్ద చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయి. రెండేళ్లలో పనులు పూర్తి కావాల్సి ఉండగా, మరో ఏడాదైనా పనులు పూర్తయ్యే అవకాశాలు కనబడడం లేదు. ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి 2022లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 119 కోట్ల 50 లక్షల రూపాయలు మంజూరుచేశాయి. అదే ఏడాది సెప్టెంబర్‌లో పనులకు టెండర్లు దాఖలు కాగా, అదే నెలలో ఒప్పందాలు కుదిరాయి. అక్టోబరు 10న రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి భూమిపూజ చేశారు. మొదట్లో పనులు వేగంగా జరిగినా ఆ తర్వాత పనుల్లో వేగం మందగించింది. సికింద్రాబాద్-నుంచి న్యూఢిల్లీ వరకు గల అతిపెద్ద రైల్వేలైన్ పెద్దపల్లి గుండా పోతున్నది. ఈలైన్‌లో అనేక ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్, ప్యాసింజర్ తో పాటు గూడ్స్ రైళ్లు నడుస్తుంటాయి. దీంతో చీటికి, మాటికి గేట్లు పడుతుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రైల్వే గేటు పడిందంటే గంటకు పైగా వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. మూడు నుంచి ఐదు రైళ్లు వెళితే గానీ గేటు తెరవకపోవడంతో ఉద్యోగస్థులు, విద్యార్థులు, రైతులు, రైతు కూలీలు, ఆటో డ్రైవర్లు సమయానికి చేరుకోక నిత్యం అవస్థలు పడు తున్నారు. 2022లో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు మొద లైనప్పటికి ఇప్పటికి పూర్తి కాకపోవడంతో ఇబ్బం దులు ఎదురవుతున్నాయి. కూనారం రోడ్డు రైల్వే ట్రాక్ గుండా నిత్యం వేలాది వాహనాలు నడుస్తుం టాయి. దీనికి తోడు మానేరు వాగుపై గుంపుల-తనుగుల మధ్య ఒక వంతెన, హుస్సేనిమియా వాగుపై చిన్నరాతుపల్లి-పెద్దరాతుపల్లి మధ్య మరో వంతెన, కూనారం వద్ద మరో బ్రిడ్జి నిర్మించడంతో ఈ దారిగుండా వాహనాల రాకపోకల సంఖ్య పెరిగింది. మంథని వరంగల్, జమ్మికుంట, కాల్వశ్రీరాంపూర్‌లకు దూరభారం తగ్గడంతో అన్ని రకాల వాహనాలు ఈ దారిగుండా వెళ్తున్నాయి. గేటు పడిన తరువాత చాలాసేపటి వరకు తెరుచుకోకపోవడంతో పెద్ద సంఖ్యలో వాహనాలు వేచిచూడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో ఈదారి గుండా వెళ్లే ప్రయా ణికులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులు, గర్భిణులు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. పాఠశాలలకు, కాలే జీలకు వెళ్లే విద్యార్థులు సమయానికి చేరుకోలేక పోతున్నారు. ఉద్యోగులు సరైన సమయానికి చేరుకోక పోవడంతో గైర్హాజరు పడుతోందని వాపోతున్నారు. గ్రామాలకు నడిచే రూట్, షటిల్ బస్సులు సరైన ట్రిప్పులు వేయకపోవడం వల్ల ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. బ్రిడ్జి నిర్మాణం పనులు నడిచేచోట తాత్కాలిక రోడ్డు వేయక పోవడంతో గంటల తరబడి వేచిచూడాల్సి వస్తోంది. ఇప్పటికైనా బ్రిడ్జి పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

రోజులో రెండు ట్రిప్పులు పడడం లేదు..



ఎప్పుడు గేటు పడుతుండడంతో తెలియడం లేదు. రోజుకు రెండు ట్రిప్పులు పడడే కష్టంగా మారింది. కుటుంబ ఖర్చులు వెళ్లదీయడం కష్టంగా మారింది. వెంటనే బ్రిడ్జి పనులు పూర్తిచేయాలి.

- కారుపాకల రాజేంద్ర ప్రసాద్, వెన్నంపల్లి, ఆటో డ్రైవర్

పెద్దపల్లి రావాలంటే గేటుతో ఇబ్బంది..



వ్యవసాయ పనుల అవసర నిమిత్తం పెద్దపల్లికి రావాలంటే రైల్వే గేటు తల నొప్పిగా మారింది. రోజంతా ఇటే గడిచిపోతుంది. బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలి.

- దామ కనుయ్య, హన్మంతునిపేట, రైతు

కల్లు గీత కార్మికులకు అన్యాయం చేస్తే సహించేది లేదు

పాలకుర్తి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తాతముత్తాతల నుంచి తాటి, ఈత చెట్లను నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్న కల్లు గీత కార్మికులకు అన్యాయం జరిగితే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. శుక్రవారం మండలం పరిధిలోని లక్ష్మీపురం, కన్నాల, రాణాపూర్, ఎల్కలపల్లి గేట్ గ్రామాలకు చెందిన గౌడ కుల సంఘాల నాయకులు కుటుంబసభ్యులతో కలిసి ఎన్టీపీసీ యాజమాన్యం నిర్మిస్తున్న సోలార్ ప్లాంట్, బూడిద ప్లాంట్ల వద్ద వంటావార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన పుట్ట మధు, తెలంగాణ రాష్ట్ర రైతు హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడిమడుగుల మల్లయ్యలు మాట్లాడారు. నాలుగు గ్రామాలకు చెందిన వేలాది ఈత చెట్లను ఎన్టీపీసీ యాజమాన్యం రాత్రికి రాత్రి తొలగించి గౌడ కులస్థులను కులవృత్తికి దూరం చేసేందుకు కుట్ర చేస్తోందన్నారు. ఎన్టీపీసీ యాజమాన్యం తాటి ఈత చెట్లను తొలగించడం మానుకోవాలని, గీతకార్మి కులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు హక్కుల సాధన సమితి కార్యదర్శి ఎరుకల రాజయ్య, మోకు దెబ్బ జిల్లా అధ్యక్షుడు బిందె నాగభూషణం గౌడ్, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాగిరి అంజన్ కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



వంటావార్పు కార్యక్రమంలో మాట్లాడుతున్న పుట్ట మధూకర్

ఖనివాసులకు జాతీయస్థాయి అవార్డులు


అవార్డు అందుకుంటున్న ఎండి ఇబ్రహీం

కోల్‌సిటీటౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలోని మహారాష్ట్ర సదన్‌లో శుక్రవారం జరిగిన క్రాంతి జ్యోతి సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల్లో గోదావరిఖనికి చెందిన స్వచ్ఛంద సంఘాల బాధ్యులు ఈదునూరి శంకర్, ఇన్‌కమ్ ట్యాక్స్ ఆడిటర్ ఎండీ ఇబ్రహీంలు జాతీయ అవార్డులు అందుకున్నారు. ఇండియన్ గెలాక్సీ ఫౌండేషన్ న్యూఢిల్లీ, అంబేద్కర్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవార్డుల ప్రదానోత్సవంలో ఈదునూరి శంకర్ అంబేద్కర్ భారత్ భూషణ్ అవార్డు, ఇన్‌కమ్ ట్యాక్స్ ఆడిటర్ ఎండి ఇబ్రహీం అంబేద్కర్ నేషనల్ ఎక్సెల్సీ అవార్డులను నేషనల్ కమిషన్ ఫర్ మైనార్టీస్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మెంబర్ రించన్ లామో, మాజీ కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి మీనాక్షి లేకి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

సీఎంకప్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకం


సంజన

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సీఎంకప్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో జిల్లాకు చెందిన సంజన బంగారు పతకాన్ని సాధించింది. గత నెల 31 నుంచి ఈ నెల 2 వరకు హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కరరెడ్డి స్టేడియంలో నిర్వ హించిన సీఎం కప్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో 55 కిలోలలోపు కేటగిరిలో కరీంనగర్ జీఆర్ఆర్ కరాటే అకాడమీకి చెందిన సంజన పాల్గొని బంగారు పతకం సాధించిందని జీఆర్ఆర్ కరాటే అకాడమీ కోచ్ గౌరు రాజిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బంగారు పతకం సాధించిన సంజనను జిల్లా యువజన, క్రీడాశాఖాధికారి వి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, కోచ్ రాజిరెడ్డి అభినందించారు.

ప్రశాంతంగా సీడీపీవో పరీక్ష


అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

రామగిరి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో టీజీ పీఎస్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం సీడీపీవో ఉద్యోగాలకు నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం, సాయంత్రం రెండు పేపర్లకు జరిగిన పరీక్షలో 100 మంది అభ్యర్థులకు 52 మంది హాజరైయ్యారు. అందులో 48 మంది గైర్హాజరు అయినట్లు ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రామగిరి ఎస్‌ఐ చంద్రకుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. పరీక్ష రాసే అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించిన అనంతరం లోనికి అనుమతించారు. పరీక్ష నిర్వహణను ప్రత్యేక అధికారిగా తహసీల్దార్ రామచందర్‌రావు పర్యవేక్షించారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- రీచ్ ఏర్పాటైనా నిబంధనల అమలులో జాప్యం
- జరిమానాల విధింపులో మీనమేషాలు
- సిరికొండ - తక్కళ్లపల్లి వాగులో ఇసుక మాఫియా ఇష్టారాజ్యం

కథలాపూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లి-సిరికొండ పెద్దవాగులో ఇసుక మాఫియా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం రీచ్ ఏర్పాటుకు నిర్ణయించింది. సర్కారు ఆదాయానికి గండి పడుతుందనే ఉద్దేశ్యంతో మైనింగ్ అధికారులతో సర్వేలు చేయించి రీచ్ మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో అక్రమ ఇసుక రవాణాకు అడ్డు వేస్తూ పలు నిబంధనలు విధించారు. అయితే ఆ నియయ నిబంధనలు ఎక్కడా అమలు కాకపోగా తమ ఇష్టారాజ్యంగా ఇసుకను తోడేస్తున్నారు.


తక్కళ్లపల్లి వాగులో ఇసుకను తోడుతున్న అక్రమార్కులు

● నిబంధనల అమలులో జాప్యమెందుకో?

రీచ్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు వచ్చిన క్రమంలో ఇసుక రవాణాదారులతో రెవెన్యూ అధికారులు ప్రత్యేకంగా అవగాహనా సమావేశం ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో ట్రాక్టర్ల వివరాలను నమోదు చేసుకోవాలని లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తుల మేరకు వారికి రవాణాకు అవకాశం ఇస్తామని వివరించారు. అయితే ట్రాక్టర్ యజమానులు అందుకు విముఖత చూపి పాత విధానం ప్రకారం డీడీలు చెల్లిస్తామంటూ అధికారులకు చెప్పారు. కాగా ఉన్నతాధికారులు ఆ పద్ధతికి అంగీకరించడం లేదని తెలిసింది. స్థానిక అధికారులు ఎలాంటి నిబంధనలు అమలు చేయకపోవడం వల్ల రాత్రింబవళ్లు యథేచ్ఛగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల్లోని పలు ప్రదేశాల్లో ఇసుకను నిల్వచేసి నిజామాబాద్, ఆర్మూర్, మెట్‌పల్లి వంటి పట్టణాలకు టిప్పర్లు, లారీల్లో రాత్రివేళల్లో తరలిస్తున్నారు. గంబీర్‌పూర్, తాండ్ర్యాల, పోసానిపేట వాగులో ఏకంగా జేసీబీలు ఏర్పాటు చేసుకుని లారీలతో కొడిమ్యాల, రుద్రంగి, బీమారం మండలాలకు పగటి వేళల్లోనే తరలించుకు పోతున్నారు. ప్రవహిస్తున్న నీటిలో బ్లేడ్ ట్రాక్ట ర్లతో నిరంతరం తోడుతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. రెవెన్యూ, పోలీసులు పది రోజుల కిందట రాత్రివేళల్లో దాడులు నిర్వహించగా ఆరు ట్రాక్టర్లను పట్టుకున్నారు. బొమ్మెనలో పలు చోట్ల నిల్వ ఉన్న డంపులను పట్టుకుని అక్క డికక్కడే టెండర్‌వేసి విక్రయించారు. పట్టుకున్న ట్రాక్టర్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఉంచగా నేటికీ జరిమానా విధించడంలో ఎందుకు జాప్యం జరుగుతుందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రీచ్ నిబంధనలు పాటిస్తారా లేక పాత విధానంలో డీడీలతో ఇసుకు రవాణాకు అనుమతులు ఇస్తారా అనే విషయం చర్చనీయాంశంగా మారింది.


అధికారులు పట్టుకున్న ట్రాక్టర్లు

పార్టీకి ప్రజాసంఘాలే పట్టుకొమ్మలు

భగత్‌నగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు పార్టీకి ప్రజా సంఘాలే పట్టుకొమ్మలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ శాసనసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జిల్లా కార్యవర్గ, ప్రజాసంఘాల సంయుక్త సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంఘాలను బలోపేతం చేసే లక్ష్యంగా పార్టీ నాయకులు పనిచేయాలని సూచించారు. సీపీఐ వందేళ్ల చరిత్రలో పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించి ఎన్నో విజయాలు సాధించామన్నారు. వర్గ దోపిడీకి వ్యతిరేకంగా కార్మిక, కర్షక, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ముందుండి పోరాటాలు నిర్వహించేది సీపీఐ మాత్రమే అన్నారు. పార్టీ అభ్యున్నతి, బలోపేతం కోసం ప్రజాసంఘాల నిర్మాణం బలంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాసంఘాల బాధ్యులు నిరంతరం శ్రమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్ నాయకులు అందె స్వామి, బోయిని అశోక్, గూడెం లక్ష్మీ, టేకుమల్ల సమ్మయ్య, ప్రజా సంఘాల ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

ఏపీవెటా ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రానున్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా తెలంగాణ ఆర్ట్, ఫిజికల్, వర్క్, ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీవెటా) ఆధ్వర్యంలో సంక్రాంతి చిత్రాల సంబరాలు అనే అంశంపై చిత్రలేఖన పోటీలను ఉమ్మడి జిల్లాలో నిర్వహిస్తున్నామని ఏపీవెటా అధ్యక్షులు తాడూరి లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ పోటీల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనేవారు ఏ4 సైజ్ పేపర్‌పై చిత్రం గీసి ఈ నెల 10వ తేదీలోపు ఏపీవెటా కార్యాలయం, ఇంటి నెం. 2-7-146, బస్టాండ్ పక్కన, కళాభారతి ఎదురుగా, కరీంనగర్ అనే చిరునామాకు నేరుగా గాని, పోస్టులో గాని పంపించాలని తెలిపారు. వివరాలకు 9849302904 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సావిత్రీబాయి పూలే పోరాటం స్ఫూర్తిదాయకం


వేడుకలను ప్రారంభిస్తున్న సిబ్బంది

గణేశ్‌నగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): లింగ వివక్ష, కుల అసమానతలపై సావిత్రీ బాయి పూలే పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేష్‌కుమార్ అన్నారు. సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను శాతవాహన విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ మహమ్మద్ జాఫర్ అధ్యక్షతన జరిగిన వేడుకలకు ముఖ్యఅతిథిగా ఉమేష్‌కుమార్ హాజరయ్యారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్ మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉన్నారంటే అది సావిత్రీబాయి పూలే చేసిన కృషి ఫలితమేనని అన్నారు. ఆచార్య సుజాత మాట్లాడుతూ మహిళల అభివృద్ధి, విద్య కోసం సావిత్రిబాయి పూలే తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ మనోహర్, విశ్వవిద్యాలయ బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ సరసిజ, ఉమెన్స్ సెల్ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, సైన్స్‌కళాశాల ప్రిన్సిపాల్ జయంతి, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరికాంత్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మాజీ మంత్రి పరామర్శ

ధర్మారం జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండల కేంద్రానికి చెందిన దేవి సిద్ధార్థను మాజీ మంత్రి కొప్పుల ఈ శ్వర్ శుక్రవారం పరామర్శించారు. కరీంనగర్‌లో శస్త్రచికిత్స అనంతరం ధర్మారంలోని స్వగృహానికి వచ్చిన సిద్ధార్థను కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. ధర్మారం మాజీ సర్పంచ్ పూస్కూరి జితేందర్‌రావు,మేడారం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గుర్రం మోహన్‌రెడ్డి, కూరపాటి శ్రీనివాస్, పాక వెంకటేష్, ఆవుల శ్రీను, నాడెం శ్రీనివాస్, ఆవుల వేణు, మోకెనపల్లి రాజమ్మ, కల్లెపల్లి లింగయ్య పాల్గొన్నారు.

సీఎంరిలీఫ్ చెక్కు అందజేత

ఎలిగేడు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శివపల్లిలో శుక్రవారం కాట్నపల్లికి చెందిన అంజమ్మ అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరింది. వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.1.50 లక్షల విలువగల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు.

ఎల్‌ఓసీ మంజూరు

ముత్తారం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లెలపల్లెకు చెందిన గడ్డం రాజేశంకు కిడ్నీ వైద్యం కోసం నిమ్స్ ఆసుపత్రిలో చేరాడు. వైద్యం సహాయం కోసం మంత్రి శ్రీధర్‌బాబు తెలుపగా ఎల్‌ఓసీ ద్వారా రూ.లక్ష మంజూరుచేయించారు. ఆసుపత్రి సహాయకులు బాధిత కుటుంబ సభ్యులకు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందచేశారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

జూలపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావును ఆయన స్వగ్రామం శివపల్లిలో శుక్రవారం మండలంలోని కాంగ్రెస్ నాయకులు జెట్టి సతీష్, దండె వెంకటేశంలు మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సరం సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

నూతన పీఏసీఎస్‌ల ఏర్పాటు కోసం కలెక్టర్లకు వినతి

మంథని, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మంథని నియోజకవర్గంలో నూతన పీఏసీఎస్‌ల ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు ఇచ్చినట్లు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు శుక్రవారం తెలిపారు. పెద్దపల్లి జిల్లా పరిధిలో బేగంపేట, ఖమ్మంపల్లి, గుంజపడుగు, వెంకటాపూర్, భూపాలపల్లి జిల్లా పరిధిలో పలిమెల, కాళేశ్వరం, దామెరకుంట, బొర్లగూడెంలో కొత్త పీఏసీఎస్‌ల ఏర్పాటుచేయాలని కలెక్టర్లలకు వినతిపత్రాలు పంపిపామన్నారు.

కొత్త పీఏసీఎస్‌ల కోసం డీసీవోకు వినతి

మంథని, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు మండలంలోని గుంజపడుగు, వెంకటాపూర్‌లో కొత్త పీఏసీఎస్‌లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ పెద్దపల్లి డీసీవో శ్రీమాలకు మంథని పాలక వర్గం తరుపున శుక్రవారం వినతిపత్రం ఇచ్చినట్లు చైర్మన్ కొత్త శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బెల్లంకొండ ప్రకాష్‌రెడ్డి, డైరెక్టర్లు దేవళ్ళ విజయ్‌కుమార్, ఆకుల రాజబాబు, పెద్దిరాజు ప్రభాకర్, గడ్డం పోచం, కొత్త శ్రీనివాస్, ఉడుత మాధవి-పర్వతాలు యాదవ్, సీఈవో మామిడాల అశోక్ కుమార్ ఉన్నారు.

చదువులు సాగేదెలా..?

(5వ పేజీ తరువాయి)

ఫీజులు చెల్లించకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు రాక ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు బోధన, బోధనేతర సిబ్బందికి సకాలంలో వేతనాలు చెల్లించేందుకు తంటాలు పడుతున్నారు. కొన్ని కళాశాలల్లో యజమానులు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారని సమాచారం. కోర్సులు పూర్తిచేసుకున్న విద్యార్థుల నుంచి మాత్రం కాగితాలు రాయించుకుని ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులను విడుదల చేసిన తర్వాత తిరిగి తమకు చెల్లిస్తా మని చెబుతున్నారని విద్యార్థులు పేర్కొంటున్నారు. రెండు విద్యా సంవత్సరాలు ముగిసినా కూడా ఫీజు రీయింబర్స్‌మెం ట్‌తో పాటు స్కాలర్‌షిప్ డబ్బులు విడుదల చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలుచేసేందుకు ఆయా పథకాలకు బడ్జెట్‌ను మళ్లిస్తుండ డంతో ఫీజులు విడుదల కావడం లేదని తెలుస్తున్నది. ఇప్పటివరకు 2 లక్షల రూపాయల వరకు రుణ మాఫీ చెల్లిం చగా, ప్రస్తుతం ప్రభుత్వం రైతు భరోసా పథకం అమలుపై దృష్టి సారించింది. పన్నుల రూపేణా ప్రభుత్వానికి జమ అవుతున్న డబ్బులను రుణ మాఫీ, ఇతరత్రా పథకాలకు మళ్లిస్తున్నారు. మొత్తంగా కాకపోయినా కొంత మేరకైనా బడ్జెట్ విడుదల చేస్తే కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులకు ఊరట కలిగేది. ఏడాది అవుతున్నా కూడా బడ్జెట్ అంతంత మాత్రంగానే విడుదల చేస్తున్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ డబ్బులను విడుదల చేయాలని విద్యార్థులు, ప్రైవేట్ కళాశాలల యజమానులు కోరారు.

సాహితీ విమర్శకుడిగా లక్ష్మీప్రసాద్

- ఆంగ్ల సాహిత్యంలో పరిశోధనాత్మక గ్రంథాలు - జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు



పురం లక్ష్మీప్రసాద్(ఫైల్)

సుల్తానాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని పూసాలకు చెందిన పురం లక్ష్మీప్రసాద్ సాహితీ విమర్శకుడిగా ప్రశంసలు అందుకుంటున్నారు. చిన్నతనం నుంచే లక్ష్మీప్రసాద్‌కు ఆంగ్ల భాషపై మక్కువ ఏర్పడింది. అదే ఆయనను రచయితగా, కాలమిస్టుగా, విశ్లేషకుడిగా తీర్చిదిద్దింది. ముత్తాత రంగా రావును ఆదర్శంగా తీసుకొని పుస్తక పఠనం అలవర్చుకున్న ఆయన ఆంగ్ల సాహిత్యంపై పరిశోధన చేసి డాక్టరేట్ అందుకున్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్న లక్ష్మీప్రసాద్ ఇప్పటివరకు ఆంగ్లంలో 44 పుస్తకాలు రాశారు. ఇతర రచయి తల పుస్తకాలపై 55 సమీక్షలు చేశారు. 80పరిశోధనాత్మక వ్యాసాలు, అనేక కవితలు రాశారు. ఇలా 36 జర్నల్స్‌లో 300 పైచిలుకు వ్యాసాలు, పుస్తక సమీక్షలు, కవితలు ప్రచురితమయ్యాయి. అలాగే దేశంలోని ప్రముఖ ఆంగ్ల దినపత్రికలకు లక్ష్మీప్రసాద్ కాలమిస్టుగా కొనసాగుతున్నారు. పలువురు గొప్ప రచయితలపైనా ఆయన విమర్శనాత్మక గ్రంథాలను ప్రచురించారు.భారతీయ మహిళలు వివిధ రంగాల్లో చేసిన సేవలను గుర్తిస్తూ ఒక గ్రంథాన్ని వెలువరించారు. ఆంగ్ల జర్నల్స్‌కి సైతం ఎడిటర్‌గా, పుస్తక సమీక్షకుడిగా పనిచేశారు. జాతీయ, అంతర్జాతీయ సెమినార్లలో కీలక ఉపన్యాసాలు చేశారు. తన 24 ఏళ్ల ప్రస్థానంలో లెక్చరర్‌గా విద్యార్థులకు ఉపయోగకరమైన పలు గ్రంథాలను లక్ష్మీప్రసాద్ ప్రచురించారు.



లక్ష్మీప్రసాద్ రాసిన గ్రంథాలు



పెద్దపల్లిలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించిన వార్డు కౌన్సిలర్లు



దీక్షా శిబిరంలో నివాళులర్పిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు



గోదావరిఖని కృష్ణవేణి స్కూల్‌లో..

సావిత్రీబాయి పూలేకు ఘన నివాళి

పెద్దపల్లి కల్చరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కల్లెపల్లి అశోక్ అన్నారు. శుక్రవారం కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెద్దపల్లి మహిళ జూనియర్ కాలేజీలో కార్యక్రమం నిర్వహించారు. శ్రామిక మహిళ అధ్యక్షురాలు గడ్డం జ్యోతి మాటాడారు. జిల్లా అధ్యక్షులు మొదుంపల్లి శ్రావణ్, ఆదిత్య, అభి,సమత తదితరులు పాల్గొన్నారు.పెద్దపల్లి పట్టణ 23వ వార్డు ఇండియన్ మిషన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో వార్డు కౌన్సిలర్ తాడూరి పుష్పకళా శ్రీమాన్ అధ్యక్షత వహించారు. మహిళా ఉపాధ్యాయులైన గోవిందుల భాగ్యలక్ష్మి, పోగల అనుష ,గుండ సువర్ణ, పార్వతి జ్యోతి, సి పెల్లి సప్న కౌన్సిలర్లు ఆయన తాడూరి పుష్పకల, బూతగడ్డ సంపత్, తూముల సుభాష్‌రావులు సన్మానించారు. కరస్పాండెంట్ ధనుం జయరెడ్డి, మాజీ ఎంపీటీసీ బొడ్డుపల్లి శ్రీనివాస్ పుష్పకళా శ్రీమాన్ ,భూత గడ్డ సంపత్, తూముల సుభాష్ రావు దితరులు పాల్గొన్నారు. పెద్దపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు భూషణవేన సురేష్ గౌడ్ ప్రభుత్వ పాఠశాలలో మహిళ ఉపాధ్యాయులను సత్కరించారు. కౌన్సిలర్లు బూతగడ్డ సంపత్, తూముల సుభాష్ రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మేడగోని శ్రీనివాస్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దొడ్డుపల్లి జగదీష్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బొంకూరి అవినాష్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి బొడ్డుపల్లి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గంగుల సంతోష్, ఎరుకల రమేష్, తాడూరు శ్రీమాన్, కట్ట నరేంద్ర చారి, కోదాది భాస్కర్, తిరుమలరావు, కనకయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● పెద్దపల్లి రూరల్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాఘవపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు లక్ష్మీ ప్రసూన, రఫత్ సుల్తానా, మంజుల, సౌమ్య, లత, శైలజ, రమేష్, మోహన్, రాజు, శ్రీనివాస్, శ్రీకర్ పాల్గొన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల శిబిరం వద్ద వేడుకలు నిర్వహించారు. పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా అధ్యాపకులను సత్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.లక్ష్మీ నర్సయ్య, పాల్గొన్నారు.

● ఓదెల: మండలంలోని కొలనూర్ హైస్కూల్లో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయురాళ్ళను ఘనంగా సన్మానించారు.

● ముత్తారం(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు.

● ఎలిగేడు : మండలంలో ఎలిగేడు, ధూళికట్ట, సుల్తాన్‌పూర్ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో సావిత్రి బాయిపూలే జయంతి నిర్వహించారు.

● సుల్తానాబాద్ (ఆంధ్రజ్యోతి): సావిత్రి బాయి జయంతిని పురస్కరించుని మండల పరిషత్ కార్యాలయంలో, మున్సిపల్ ఆఫీసులో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నివాళులర్పించారు.

● కాల్వశ్రీరాంపూర్ : తారుపెల్లి ఉన్నత పాఠశాలలో పూలమాలలువేసి నివాళులర్పించారు. మహిళా టీచర్లకు పాఠశాలలో శాలువాలతో ఘనంగా సన్మానం నిర్వహించారు. ఎంఈఓ మహేష్, పాఠశాల హెచ్ఎం శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● రామగిరి (ఆంధ్రజ్యోతి): సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకొని ప్రగతి పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

● పాలకుర్తి (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని పుట్నూర్ గ్లోబల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మహిళ ఉపాధ్యాయులను సత్కరించారు.

● కోల్‌సిటీ టౌన్ (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. మాజీ మంత్రి మాతంగి నర్సయ్య కూతురు సామాజిక సేవకురాలు మాతంగి సునీత, మహిళా సంఘం నాయకురాలు జీనోత్ బేగంలను సన్మానించారు. అడ్డగుంటపల్లి కృష్ణవేణి విద్యాసంస్థల్లో సావిత్రిబాయిపూలే జయంతి నిర్వహించారు. స్థానిక స్నేహసాహితీ గ్రంథాలయంలో తొలి జయంతి నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన సావిత్రిబాయి జయంతి కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జైకిషన్ ఓజా సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులుఅర్పించారు.

● అంతర్గాం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వేడుకలను నిర్వహించారు. తహసీల్దార్ రవీందర్ నివాళులర్పించారు.

● మంథని (ఆంధ్రజ్యోతి): సావిత్రి బాయిపూలే జయంతి సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, ప్రజా సంఘాల, కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు వేర్వేరుగా నివాళులర్పించారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌సీపతి బానయ్య, బీఆర్ఎస్ నేతలు తగరం సుమలత, శంకర్‌లాల్, ఏగోళపు శంకర్‌గౌడ్, మాచీడి రాజుగౌడ్, పూదరి సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● ధర్మారం (ఆంధ్రజ్యోతి): సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొని, సాయిమణికంఠ హైస్కూల్‌లో ఎండి జైన రమాదేవి ఆధ్వర్యంలో నివా ళులు అర్పించారు.



మంథని ఎమ్మెల్యే కాంపు కార్యాలయంలో..



సుల్తానాబాద్‌లో నివాళుర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి



ఓదెల మండలం కొలనూర్ హైస్కూల్‌లో..

ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక కార్యాచరణ : కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : రాబోయే పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలుచేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన ప్రత్యేక కార్యాచరణను ప్రణాళికను కలెక్టర్ విడుదల చేశారు. మార్చి నెలలో జరిగే పదో తరగతి పరీక్షల కోసం ప్రణాళిక ప్రకారం విద్యార్థుల స్థాయిని పెంచి మంచి ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీఈవో మాధవి, జిల్లా సమగ్ర శిక్ష సమన్వయకర్త పిఎం షేక్, అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్ర అతిథి అధ్యాపక నియామకం కోసం ఈనెల 9న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనర్సయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ధ్రువపత్రాలతో ఈనెల7లోపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తు సమర్పించాలని తెలిపారు.

నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

మంథని, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వీ. నరేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మంథనిలోని పలు కళాశాలు, స్కూల్స్‌లో నరేందర్‌రెడ్డి పర్యటించి తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం స్థానిక ఎస్ఎల్‌బీ గార్డెన్స్‌లో జరిగిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో నరేందర్‌రెడ్డి మాటాడారు. కొండేల మారుతి అధ్యక్షతన జరిగిన ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు అంకరి కుమార్, దహగం శ్రీనివాస్, బెజ్జంకి డిగంబర్, ఆర్ల సందీప్, తిరుపతి, బుచ్చయ్య, లక్ష్మి, గ్రాడ్యుయేట్స్ పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై శ్రద్ధ వహించాలి

ముత్తారం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆంగ్ల ఒలంపియాడ్ పోటీలను ఎంఈవో ఓదెలు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్లంభాషపై ప్రత్యేక శ్రద్ధ వహించి పట్టు సాధించాలని విద్యార్థులను కోరారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎంఈవోతో పాటు ముత్తారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మాదేవి ప్రసంసా పత్రాలను అందజేశారు. మండల కన్వీనర్ రాజ్‌కుమార్, రవి, సహేద పాల్గొన్నారు.

● కోల్‌సిటీటౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎల్టా) ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిఖని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆంగ్ల ఒలింపియాడ్(రాత పరీక్ష), ఎలక్యూషన్(ఉపన్యాసం) పోటీలు నిర్వహించారు. రామగుండం ఎంఈవో చంద్రయ్య, పాఠశాల హెచ్ఎం జీ.మల్లేశం ప్రశ్నపత్రాలను ఆవిష్కరించారు. ఎల్టా జిల్లా వ్యవస్థాపకులు గడ్డం జగదీశ్వర్ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో 18వ తేదిన, రాష్ట్రస్థాయిలో 31వ తేదిన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కళ్యాణ్‌నగర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీపీసీ పద్మశాలి సేవా సంఘం నూతన క్యాలెండర్‌ను గురువారం రాత్రి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఆవిష్కరించారు. గౌరవ అధ్యక్షులు నూరం సత్యనారాయణ, అధ్యక్షులు అనుముల భద్రయ్య, ప్రధాన కార్యదర్శి కమలాకర్, కోశాధికారి బుచ్చిరాములు, సలహాదారులు మామిడాల చంద్రయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● పెద్దపల్లి కల్చరల్ (ఆంధ్రజ్యోతి) : డీటీఎఫ్ నూతన క్యాలెండర్‌ను పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆవిష్కరించారు. ఎమ్మెల్యేకు డీటీఎఫ్ డైరీని బహూకరించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. రాంకిషన్‌రావు, ఏ సంతోష్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి జే కొమరయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కే కిషన్‌రెడ్డి, పి వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు : సీపీ

కోల్‌సిటీ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రామగుండం కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, మహిళలతో అసభ్యంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. నిషేధాజ్ఞలు ఫిబ్రవరి వరకు ఉంటాయన్నారు.

ఇస్రో 'స్టార్ట్' శిక్షణకు నోడల్ సెంటర్‌గా సింగరేణి మహిళా కళాశాల

గోదావరిఖని, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఇస్రో స్టార్ట్-2025 శిక్షణ కార్యక్రమానికి సింగరేణి మహిళా కళాశాల నోడల్ కేంద్రంగా ఆమోదం పొందింది. సింగరేణి సీఅండ్ఎండీ బలరామ్ ఆదేశాల మేరకు కెమిస్ట్రీ హెచ్‌వోడీ డాక్టర్ జి.శైలజ సమన్వయం చేయనున్నారు. ఫ్యూచర్ ఆఫ్ ఇండియాస్ స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ అనే థీమ్‌తో స్పెస్ సైన్స్ అండ్ టెక్నాలజీ అవేర్‌నెస్ ట్రైనింగ్ (స్టార్ట్)2025 కార్యక్రమం మూడవ ఎడిషన్ కోసం నమోదు చేసుకోవడానికి భారతీయ విద్యాసంస్థలకు ఇస్రో అవకాశాన్ని కల్పిస్తుంది. సింగరేణి మహిళా కళాశాలలో మూడవ సంవత్సరం బీఎస్‌సీ విద్యార్థినుల్లో సుమారు 30 మంది విద్యార్థులు శిక్షణ పొందేందుకు అవకాశం ఉంటుందని, ఆన్‌లైన్‌లో ఇస్రో శాస్త్రవేత్తలు, నిపుణుల ఉపన్యాసాలు ఉంటాయని, ఆన్‌లైన్‌లోనే విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేస్తారని అధికారులు తెలిపారు.

సింగరేణి స్కూల్‌లో మహిళా ఉపాధ్యాయ దినోత్సవం

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సెక్టార్-3 సింగరేణి హైస్కూల్‌లో శుక్రవారం మహిళా ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పాఠశాల యాజమాన్యం మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించింది. హెచ్ఎం సుందర్‌రావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వకీల్‌పల్లె గనిలో ఏఐటీయూసీ గేట్ మీటింగ్

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): వకీల్‌పల్లె గనిలో శుక్రవారం ఏఐటీయూసీ గేట్‌మీటింగ్ జరిగింది. ఆర్జీ-2 బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్ ఈసందర్భంగా మాట్లాడారు. ఐదేళ్ళుగా జరగిన డైరెక్టర్ స్థాయి స్ట్రక్చర్ మీటింగ్ నవంబరు 28న జరిగిందని, ఈసమావేశంలో పెండింగ్ సమస్యలపై ఏఐటీయూసీ పలు డిమాండ్లను యాజమాన్యం ముందు ఉంచినట్టు తెలిపారు. మెడికల్ అన్‌ఫిట్ అయిన మైనింగ్ స్టాఫ్, ఈఅండ్ఎం, ట్రేడ్స్‌మెన్స్, ఈపీ ఆపరేటర్లు, సూపర్‌వైజర్లకు సూటబుల్ జాబ్ ఇవ్వాలని డిమాండ్ పెట్టినట్టు తెలిపారు. డిస్మిస్ అయిన 54 మంది జేఎంఈటీలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, క్యాంటీన్‌లలో నాణ్యమైన పదార్థాలు అందుబాటులో ఉంచాలని, కాంట్రాక్టు కార్మికులకు క్యాంటీన్ సదుపాయం కల్పించాలని సమావేశంలో ప్రస్తావించినట్టు రవీందర్ పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఈపీ ఆపరేటర్ల ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని, మారు పేర్ల సమస్యను పరిష్కరించాలని కోరినట్టు తెలిపారు. పెర్క్స్ మీద ఐటీ రీయంబర్స్ చేయించడం, సొంత ఇంటి పథకం, ప్రమోషన్ పాలసీని మెరుగుపరచడం వంటివి సాధించే దిశగా ఏఐటీయూసీ కృషి చేస్తుందని అన్నారు. పలువురు కార్మికులు యూనియన్‌లో చేరారు. ఈ గేట్‌మీటింగ్‌లో అన్నారావు, తిరుపతి, బొట్ల సంపత్, బొంత రాజు, విజయ్, రోహిత్, అరవింద్, మోహన్, రాకేష్ పాల్గొన్నారు.

కార్మికుల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యం

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల రాజిరెడ్డి

గోదావరిఖని, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు సొంతింటి కల నెరవేర్చడమే సీఐటీయూ లక్ష్యమని, దీనికి ఇతర కార్మిక సంఘాలు కలిసి రావాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల సొంతింటి పథకం కోసం అధినాయకత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కూడా కలువడం జరిగిందని, సింగరేణిలో క్వార్టర్లు కూలిపోయే దశకు చేరుకున్నాయని, అవి కార్మికులకు నివాసయోగ్యంగా కూడా లేవని, డ్రైనేజీ, తాగునీటి సరఫరా కూడా అస్తవ్యస్తంగా ఉందన్నారు. పదవీవిరమణ పొందిన కార్మికునికే ఆ క్వార్టర్‌ను కేటాయించాలని డిమాండ్ చేసినట్టు, దీనిపై సింగరేణి యాజమాన్యానికి కూడా నివేదిక ఇచ్చినట్టు తెలిపారు. సింగరేణి ప్రాంతంలో ఎక్కడ ఎంత భూమి ఉంది, ఎన్ని క్వార్టర్లు ఉన్నాయి అనే సమాచారాన్ని కూడా ముఖ్యమంత్రికి వివరించినట్టు చెప్పారు. సింగరేణిలో గుర్తింపు సంఘమైన ఏఐటీయూసీ దొడ్డిదారిన కార్మికుల నుంచి బలవంతంగా సభ్యత్వం, గుడి నిర్మాణాల పేరిట డబ్బులు వసూలు చేయడం సరైంది కాదన్నారు. ప్రతి ఏడాది కార్మికుల నుంచి రూ.1100 చొప్పున రూ.6 కోట్లు గుర్తింపు సంఘం వసూలు చేస్తుందన్నారు. సింగరేణిలో కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి పైసలు వసూలు చేస్తున్నారని, నిస్వార్థంగా పని చేయాల్సిన నాయకులే డబ్బులు వసూలు చేస్తే కార్మికులకు ఏ విధంగా న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. సింగరేణిలో విచ్చల విడిగా అవినీతి జరుగుతుందని, దీన్ని అరికట్టాల్సిన నాయకులే ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. దొడ్డిదారిన సభ్యత్వం పేరిట వసూలు చేసిన డబ్బులను వాపసు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు మెండె శ్రీనివాస్, రాజమౌళి, మహేష్, గౌస్, వేణుగోపాల్‌రెడ్డి, సురేష్, నరేష్, జనార్దన్, మల్లయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ అసత్య ఆరోపణలు : ఐఎన్‌టీయూసీ

గోదావరిఖని, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు ఎన్నికల ముందు ప్రభుత్వం, ఐఎన్‌టీయూసీ సింగరేణి కార్మికులకు ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను నిలబెట్టుకున్నామని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ వైస్‌ప్రెసిడెంట్ ధర్మపురి పేర్కొన్నారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీబీజీకేఎస్ నాయకుడు మిర్యాల రాజిరెడ్డి ఐఎన్‌టీయూసీపై తప్పుడు ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నామని, ఆరు గ్యారంటీలు కార్మికులకు అమలు చేసి నిరూపించుకున్నామన్నారు. బీఆర్ఎస్ హయాంలో నాలుగు బ్లాకులను ప్రైవేటీకరిస్తే ఎందుకు మాట్లాడలేదని, బొగ్గు రంగంలో అనుభవం లేని అరబిందో ఫార్మసీకి బొగ్గు తీయడానికి అనుమతులు ఇచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. ఒరిస్సాలోని నైనీ బ్లాక్ పదేళ్లలో ఎలాంటి పురోగతి సాధించలేదని, ఒడిస్సా ముఖ్యమంత్రితో ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు బలరాంనాయక్, డైరెక్టర్లు సమీక్ష సమావేశంలో పాల్గొని ఫారెస్టు అనుమతులను తీసుకువచ్చింది వాస్తవం కాదా అన్నారు. సింగరేణిలో సొంతింటి పథకం కల నెరవేర్చాలనేదే ఐఎన్‌టీయూసీ తపన అని, దీని కోసం ఆరుగురు సభ్యులతో ఒక కమిటీ వేయడం జరిగిందని, సంస్థలో ఎంత మంది పని చేస్తున్నారు, పదవీ విరమణ తరువాత వారికి ఎక్కడ అవకాశం కల్పిస్తే బాగుంటుందనే దానిపై, సింగరేణిలో స్థలాలు ఎన్ని ఉన్నాయి, క్వార్టర్లు ఎన్ని ఉన్నాయనేది కూడా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్టు తెలిపారు. కార్మికుడు 30ఏళ్ల పని చేస్తే రూ.50లక్షలు కూడా జమ చేసుకోలేని పరిస్థితి అని, పదవీవిరమణ తరువాత స్థలం కొనుక్కుని ఇల్లు కట్టుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నారన్నారు. కచ్చకాయల సదానందం, లక్ష్మిపతిగౌడ్, దాస్, కృష్ణ, శ్రీనివాస్, మోహన్, నవీన్‌కుమార్, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, బుచ్చిరెడ్డి, బాపు, రాజమౌళి పాల్గొన్నారు.



దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించండి

- సీఐటీయూ



సీఎండీ బలరాంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యనియన్ నాయకులు సీఎండీ బలరాంను కోరారు. శుక్రవారం సింగరేణి భవన్‌లో సీఎండీని కలిసిన సీఐటీయూ బృందం పెండింగ్ అంశాలను ప్రస్తావించారు. సొంత ఇంటి పథకం అమలు అల వెన్స్‌లపై ఐటీ రీయింబర్స్ చేయడం, మారు పేర్ల సమస్యలు ఏళ్ళ తరబడి పరిష్కారానికి నోచుకోలేదని తెలిపారు. కాగా సొంత ఇంటి పథకాన్ని సంస్థకు అదనపు భారం కాకుండా అమలు జరిపే విధానాన్ని వారు వివరించారు. పెర్క్స్‌పై ఐటీ రీయింబర్స్, మారు పేర్ల సమస్యలను స్ట్రక్చర్ సమావేశాల్లో గుర్తింపు ప్రాతి నిధ్య సంఘాలు ప్రస్తావిస్తే త్వరగా అయ్యే అవకాశం ఉండేదని సీఎండీ పేర్కొ న్నారు. సీఎండీని కలిసిన వారిలో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి మందా నరసింహారావు, ఆర్జీ-2 బ్రాంచి సెక్రెటరీ కుం ట ప్రవీణ్, వైస్ ప్రెసిడెంట్ రాంప్రసాద్, సంపత్‌కుమార్ ఉన్నారు.

గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నేతలతో స్ట్రక్చర్ సమావేశం

రామగిరి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-3, ఏపీఏ డివిజన్లలో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై శుక్రవారం రామగిరి అతిథిగృహంలో అధికారులు స్ట్రక్చర్ సమావేశాన్ని నిర్వహించారు. పలు ప్రధాన డిమాండ్‌ల పరిష్కారం కోరుతూ గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నేతలు ఆర్జీ-3, ఏపీఏ జీఎం సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లుతో చర్చించారు. పలు డిమాండ్లపై జీఎంలు సానుకూలంగా స్పందించారు. సమావేశంలో అధికారులు శేఖరబాబు, రఘుపతి, శ్రీనివాసులు, కొలిపాక నాగేశ్వర్‌రావు, వెంకటరమణ, రామ్మోహన్, కాశీవిశ్వేశ్వరరావు, చంద్రశేఖర్, సుదర్శనం, రాజేంద్రకుమార్, రఘురాం, షబీరుద్దీన్, నాగేశ్వర్‌రావు, మతీన్, స్ట్రక్చర్ కమిటీ సభ్యులు డీటీ రావు, విజయ్, రాఘవ, భాస్కర్‌రాజు, తిరుపతి, రామారావు, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.